క్లుప్తంగా

1న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

మైలవరం: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ ప్రసాద్, ధార్మిక మండలి సభ్యులు బాలాజీప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మైలవరం నూజివీడు రోడ్డులోని శ్రీకోదండ రామాలయంలో ఆగస్టు ఒకటో తేదీన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ వ్రతాలో అన్ని వర్ణాలు, వర్గాల వారు, దంపతులుగా పూజా సరకులు తెచ్చుకుని ఉచితంగా పాల్గొనవచ్చని తెలిపారు.

బీఎల్ఓలకు వివరాలు ఇచ్చి సహకరించాలి

మైలవరం: నియోజకవర్గ ఓటర్లందరూ బూత్ లెవెల్ అధికారులు(బీఎల్ఓ) మీ ఇంటి వద్దకు వచ్చినపుడు వారికి మీ కుటుంబ సభ్యుల ఓటరు జాబితా నందు నమోదు అయిన వివరాల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే, వాటిని సరి చేయించుకోవాలని తహసీల్దారు ఎం.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు పొందవలెనన్న సదరు కుటుంబ సభ్యుని సంతకంతో కూడిన ఫారమ్–6 దరఖాస్తు, కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటో వయస్సు ధ్రువీకరణపత్రం, నివాసానికి సంబంధించిన ఆధారాలు, ఆధార్ కార్డు, రైస్ కార్డు తదితరాల నకలు సమర్పించాలని పేర్కొన్నారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

నూజివీడు: మండలంలోని సుంకొల్లులో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీపీ విజయ్ కుమార్ ఆదివారం చెప్పారు. సర్పంచ్ అధ్యక్షతన ఉదయం 9.30 గంటల నుంచి గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్లను అందజేయడంతో పాటు ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

నేడు వ్యవసాయ కార్మిక సంఘ సమావేశం

తిరువూరు: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ తిరువూరు నియోజకవర్గ సమావేశం సోమవారం పెద్దవరంలో జరుగుతుందని సంఘ నియోజకవర్గ కార్యదర్శి మరసకట్ల త్యాగరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

సాహితీమూర్తుల సేవలు సదా స్మరణీయం



విజయవాడకల్చరల్: దివంగత సాహితీమూర్తుల సేవలు సదా సర్మణీయమని అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో దివంగత సాహితీమూర్తులు ఆచార్యకేతు విశ్వనాథ రెడ్డి, శ్రీరమణ సంస్కరణ సభను గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పెనుగొండ మాట్లాడుతూ.. తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయుల్లో కేతు విశ్వనాథరెడ్డి ఒకరని తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేవన్నారు. సంగీత సాహిత్య విమర్శకుడు పన్నాల సుబ్రహ్మణ్య శ్రీ రమణ గురించి మాట్లాడుతూ రాసికన్నా వాసికి ప్రాధాన్యత నిచ్చిన సాహితీ దిగ్గజం శ్రీరమణ అని అభివర్ణించారు. పేరడీ కవిత్వానికి దిశానిర్దేశం చేసిన శ్రీరమణ తన కథల ద్వారా అద్భుతాలనే సృష్టించారన్నారు. ఆయన ప్రతిభకు మచ్చుతునక మిథునం కథ చాలన్నారు. సభను సమన్వయ పర్చిన గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. మనుషులు కనుమరుగైనా వారి సాహిత్యం సజీవంగానే ఉంటుందన్నారు. సంస్మరణ సభలో బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర నాయుడు, సభ్యులు బెల్లపు బాబ్జీ, పల్లవి వెంకట నారాయణ, గుత్తికొండ లక్ష్మి, లక్ష్మయ్య, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు. సాహితీవేత్తలు విశ్వనాథరెడ్డి, శ్రీరమణ చిత్రపటాలకు నివాళులర్పించారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురి అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామంలో కోడి పందేలు వేస్తున్న నలుగురిని నున్న పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పళతిప్ప వద్ద బహిరంగ ప్రదేశంలో కోడి పందేలు వేస్తున్న షేక్ మస్తాన్, బడుగు రాజేష్, జె.సాంబయ్య, ఎస్.సతీష్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, 14 మోటారు సైకిళ్లు, రూ.4,350 లను స్వాధీన పర్చుకొన్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు.

గ్రామీణుల ఇంటి ముంగిటకే వైద్యం



నా పేరు వంగూరు చిట్టెమ్మ, 62 సంవత్సరాలు. మైలవరం గ్రామం శుద్దిపేటలో ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాను. నాకు 15 సంవత్సరాలుగా బీపీ, షుగర్ ఉంది. గతంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మందులు తెచ్చుకోవాల్సి వచ్చేది. ఆటోకు చార్జీలు అయ్యేవి. ఈ ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ సదుపాయంతో గ్రామంలోనే ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. అవసరమైతే షుగర్‌కు రక్త పరీక్షలు చేసి, మందులు ఉచితంగా ఇస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మా లాంటి బడుగు వర్గాలకు ఎంతో మేలు జరిగింది.




నా పేరు తొమ్మండ్రు విక్టోరియమ్మ. నాకు 62 సంవత్సరాలు. మాది మైలవరం. నాకు బీపీ, షుగర్ ఉన్నాయి. కాళ్ల నొప్పులు, తల తిరగడంతో పాటు ఆయాసం కూడా వస్తోంది. నేను నిరుపేదను. కూలి పనులు కూడా చేయలేను. ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. ప్రయాణ ఖర్చులు కూడా అయ్యేవి. ఇప్పుడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ కాన్సెప్ట్ కార్యక్రమం ద్వారా వైద్యులు గ్రామానికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తున్నారు. అవసరమైన సందర్భాలలో వైద్యులు ఇంటికి కూడా వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారు. మాలాంటి వృద్ధులకు ఇంటి వద్దకే వైద్య సదుపాయం అందుతుండటంతో ఆనందంగా ఉంది.



తుక్కులూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

నూజివీడు: ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా ఆర్ఎంపీల వద్దకో.. సమీపంలోని పట్టణాల్లోని ఆస్పత్రులో గ్రామీణ ప్రజలు గతంలో పరిగెత్తేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు (వెల్‌నెస్ కేంద్రాలు) ఏర్పాటు చేసి ఏఎన్ఎంలతో పాటు మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లను నియమించడంతో కొంత మేరకు అత్యవసర వైద్యం ప్రజలకు గ్రామాల్లోనే అందుబాటులోకి వచ్చింది. దీనికి తోడు 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావడంతో గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. నూజివీడు మండలంలో దిగవల్లి, గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా వీటి పరిధిలో 24 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు సుమారు 7,335 మంది రోగులకు వైద్య సేవలను అందిస్తున్నారు. అంతేగాకుండా ఈ సెంటర్లలో 14 రకాల రక్త, ఇతర పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారికి ఉచితంగా చేస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా నెలకు 3,256 మంది వరకు పరీక్షలు చేయించుకుంటున్నారు.





రాష్ట్ర ప్రభుత్వం 104 వాహనాలను ఏర్పాటు చేసి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకురావడంతో గతంలో కంటే ప్రస్తుతం గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. ఈ వాహనం ద్వారా నెలకు మండలంలో సుమారు 5,436 మంది మందికి వైద్యసేవలను అందిస్తున్నారు. ఈ వాహనంలో కూడా 105 రకాల మందులు ఉండటంతో వాటిని అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించాలనే..

మైలవరం: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రవేశపెట్టింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజల ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్లి వైద్య చికిత్సలందిస్తున్నారు. దీంతో రోగులకు ప్రయాణ ఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా కలిసిరావడంతో గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మంచానికే పరిమితమైన వృద్ధులు, వికలాంగులు, ఆరోగ్యశ్రీ రోగులను వైద్యులు పరామర్శిస్తూ ఇంటి వద్దనే సేవలందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 105 రకాల మందులు, 14 రకాల టెస్టులు నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్లకు ఎక్కువగా బీపీ, షుగర్, గర్భిణులు, ఇతర వ్యాధిగ్రస్తులు వచ్చి మందులు తీసుకెళుతున్నారు.

వైద్యసేవలు బాగా అందుతున్నాయి



విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్యసేవలు బాగా అందుతున్నాయి. షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులు తదితర వాటికి మందులు ఇస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో 104 వాహనం దగ్గర వెళ్లి డాక్టర్‌కు చూపించుకుని మందులు తెచ్చుకుంటున్నాం. ప్రతి చిన్న అనారోగ్య సమస్యకు పట్టణానికి వెళ్లే అవసరం తప్పింది.

– యలమర్తి షద్రక్, తుక్కులూరు, నూజివీడు మండలం

రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు



విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. గతంలో ఏదైనా పరీక్ష చేయించుకోవాలంటే తప్పనిసరిగా పట్టణానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా గ్రామంలోనే అందుబాటులోకి వచ్చింది. షుగర్ ఉండటంతో నెలనెలా 104 వాహనం డాక్టర్‌కు చూపించుకుని మందులు తీసుకుంటున్నాను.

– షేక్ తాహెరున్నీసా, తుక్కులూరు, నూజివీడు

మన ఊరు - మన గ్రంథాలయం ప్రారంభం



తిరువూరు: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు తిరువూరు మండలంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మన ఊరు – మన గ్రంథాలయం కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. విద్యావేత్తలు, దాతల నుంచి సేకరించిన వెయ్యికి పైగా పుస్తకాలను మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుబాటులో ఉంచనున్నట్లు జేవీవీ ప్రతినిధి రాంప్రదీప్ తెలిపారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ఉపయుక్తమైన పుస్తకాల పఠనానికి రోజూ కొంత సమయం కేటాయించాలని రాంప్రదీప్ సూచించారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో..

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను స్పందనలో అందజేస్తే, వాటిని గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: కాట్రేనిపాడులో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు ఆదివారం చెప్పారు. వారి వద్ద నుంచి రూ.6,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. వీరిని సోమవారం నూజివీడు కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

ఆకలి తీర్చడమే బాబా ఆశయం



భక్తులకు ప్రసాదాన్ని అందిస్తున్న పీఠాధిపతి ఖాజా మొహీద్దీన్

ఏ.కొండూరు: ఆకలి తీర్చడమే గొప్ప అదృష్టంగా భావించి సుమారు 65 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్ పీఠాధిపతి ఫీర్ జాదా మొహమ్మద్ ఖాజా మొహీద్దీన్ షా తాజ్ ఖాదరి పేర్కొన్నారు. మండలంలోని చీమలపాడులోని ఏఏఎంటీకే దర్బార్‌లో ఆదివారం హుజుర్ హజరత్ బాబా ఫరీదు దీన్ గంజ్ షక్కర్ సర్కార్ వారి జెండా గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఈ దర్బార్లో సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి దీవెనలతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాబా వారి ఆశయం మేరకు కుల మతాలకతీతంగా వారు తలపెట్టిన ఈ మహా దివ్య అన్నసమారాధన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. అనంతరం బాబా వారి దివ్య సమాధి వద్ద చాదర్, పూలు, గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలాల నుంచి వచ్చిన భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో జాఫర్ షరీఫ్ తాజ్‌ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

- మూడు వేల ఎకరాల్లో ఇప్పటికే పూర్తి
- మరో నాలుగు వేల ఎకరాలకు నారు సిద్ధం



కాట్రేనిపాడులో వరి నాట్లు వేస్తున్న మహిళలు

ముసునూరు: వరుణ దేవుడు కరుణించి, వర్షాలు కురుస్తుండటం రైతులకు వరంగా మారింది. దీనికి తోడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా పథకంతో ముందస్తుగానే రైతన్నలకు పెట్టుబడి సాయం అందించడంతో వారిలో ఉత్సాహం రెట్టింపైంది. ప్రతి ఏటా కన్నా 15 రోజుల ముందే వరుణ దేవునిపై భరోసాతో నారుమడులు సిద్ధం చేసుకుని ముమ్మరంగా వరి నాట్లు వేశారు. మండలంలో 7,500 ఎకరాలలో వరి సాగు జరుగుతోంది. వర్షాలు కురుస్తుండడం, నారు కూడా సిద్ధం కావడంతో ఆదివారం సాయంత్రానికి మూడు వేల ఎకరాలలో వరినాట్లు వేయడం పూర్తయినట్లు వ్యవసాయాధికారి మధుమోహన్ చెప్పారు. మరో నాలుగు వేల ఎకరాలకు సరిపడా నారు సిద్ధంగా ఉందని, రెండు, మూడు రోజుల్లోనే 80 శాతానికి పైగా వరి నాట్లు పూర్తవుతాయన్నారు. మిగిలిన ప్రాంతాలలో వారం రోజుల్లోగా నాట్లు పూర్తి కావచ్చని తెలిపారు. రైతులందరికీ ప్రతి గ్రామంలో ఉన్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు రైతన్నలకు సూచనలు, సలహాలు అందించడం జరుగుతుందన్నారు. వీటి ద్వారానే విత్తనాలు, ఎరువులు ముందుగానే అందడం మరింత కలిసి వచ్చిందని రైతులు అంటున్నారు.

చేతినిండా కూలీలకు పనులు

వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో బోర్లు, మోటార్ల కింద సాగు చేస్తున్న గుళ్లపూడి, గుడిపాడు, సూరేపల్లి, చెక్కపల్లి గ్రామాలలో 90 శాతం వరి నాట్లు పూర్తి కాగా, లోపూడి, బలివే, యల్లాపురం గ్రామాలలో 85 శాతం వరకు నాట్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. వరినాట్లు ముమ్మరంగా సాగుతుండడంతో గ్రామాలలో చేతినిండా పని దొరుకుతోందని కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైలవరం: పట్టణంలో సోమవారం ఉదయం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ రమేష్ తెలిపారు. తిరువూరు రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, సిద్ధిపేట, బ స్టాండ్, బందర్, రామకృష్ణ కాలనీ, భవానీనగర్, ఎస్వీఎస్ నగర్, యాదవుల బజారు, మూడు బొమ్మల సెంటర్, కోట వెనుక, మెయిన్‌రోడ్, పోస్టాఫీస్ రోడ్డు, మార్కెట్ రోడ్, శివాలయం వీధి, నూజివీడు రోడ్డు, విజయవాడ రోడ్, పొందుగల రోడ్, శివాజీ వీధి, బొగ్గులుపట్టీ సెంటర్, ఏరియాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని సరస్వతీ సామాజ్య అధ్యక్షుడు అయ్యంకి మురళీకృష్ణ తెలిపారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం అంతరిక్ష వారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ విద్యార్థులకు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన కల్పించారు. అంతరిక్ష రంగంలో భారతదేశ విజయాలు, ప్రయోగాలు, స్పేస్ షిప్ తదితర అంశాలను వివరించారు. ఇటీవల భారత్ ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతం కావడం గర్వించదగ్గ విషయమన్నారు. చంద్రయాన్–3 భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన చంద్ర యాత్ర అన్నారు. భారత చంద్రయాన్ కార్యక్రమంలో ఇది మూడోవదని, చంద్రయాన్–2 లో మాదిరిగా ఇందులో కూడా రోవర్, ఒక ల్యాండర్ ఉన్నాయన్నారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి పాల్గొన్నారు

శాంతి నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలి

నూజివీడు: మణిపూర్‌లో జరుగుతున్న దాడులను అడ్డుకుని అల్లర్లకు బాధ్యులైన నిందితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణంలోని రాజీవ్ సర్కిల్ వద్ద గల మేరీమాత చర్చి ఫాదర్ లాము జయరాజు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసకు నిరసనగా కేథలిక్ సిస్టర్లు, మహిళలు ఆదివారం మేరీమాత చర్చి వద్ద నిరసన ప్రదర్శన చేశారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలకు పాల్పడుతున్న ముష్కరుల దిష్టిబొమ్మను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సీపీఎం మండల కార్యాలయం ఎదుట దహనం చేశారు. సీపీఎం నాయకుడు మద్దిరెడ్డి మాధవరెడ్డి మాట్లాడుతూ సుమారు గత మూడు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై దాడులు, జరుగుతున్నా ప్రభుత్వాలు చూసీ చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగా వెంకటరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, సీఐటీయూ నాయకుడు వెంకట్రామయ్య పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మణిపూర్ మహిళలపై దాడులు జరుగుతున్నందున అక్కడి ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాజీనామా చేయాలని అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు టి.అరుణ కోరారు. స్థానిక రామకోటేశ్వర్ నగర్‌లో అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యావత్తు దేశంలో నిరసనలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు.

30న 'కథ చెబుతారా ..ఊ కొడతాం' పోటీలు



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మప్రచార పరిషత్ సభ్యులు

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం కథ చెబుతారా.. ఊ కొడతాం ధార్మిక కథల పోటీ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ధర్మపరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు. సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో ఆదివారం అధ్యాపకులు, న్యాయనిర్ణేతల అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చుట్టుగుంటలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా లయన్స్ క్లబ్ కార్యాలయంలో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాలో ఒకటో నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉచితంగా పాల్గొనాలని కోరారు. కథలు, భారతీయ ఇతిహాసాలు, పురాణాలు, భారతీయ సంస్కృతి సంప్రదాయలకు సంబంధించి కథలు ఉండాలని సూచించారు. విజేతలకు కేటగిరిల వారీగా బహుమతులను అందజేస్తామన్నారు. జిల్లా ధార్మిక పరిషత్ సభ్యులు రమణారావు, బాల కోటేశ్వరరావు మాట్లాడుతూ బాల బాలికలలోని ప్రతిభను గుర్తించి వారికి హిందూ సంస్కృతి పట్ల అవగాహన కలిగించడానికి కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో మంగిపూడి వెంకటశాస్త్రి, ఉప్పులూరు శేషప్రసాద్, విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ పాల్గొని, బ్యానర్‌ను ఆవిష్కరించారు. వివరాలకు 70322 55499లో సంప్రదించాలని కోరారు.

నేరచరితులు సత్ప్రవర్తనతో మెలగాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): నేరచరితులు నేర ప్రవృత్తిని విడనాడి సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ తెలిపారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు స్టేషన్ ఆవరణలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరచరితులపై పోలీసులు నిఘా నిరంతరం ఉంటుందన్నారు. నేరచరితులు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి ఆదివారం కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కనకదుర్గ నృత్య మందిర్‌కు చెందిన కళాకారులు ఆదివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

వీసీబీ సభ్యుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): రెండు తెలుగు రాష్ట్రాల్లో 50 బ్రాంచిలుగా విస్తరించి ఉన్న విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు(వీసీబీ) సభ్యుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆ బ్యాంకు డైరెక్టర్ వి.చంద్రశేఖరరావు తెలిపారు. అందులో భాగంగా పటమట, వన్‌టౌన్ బ్రాంచిల్లోని సభ్యుల పిల్లలు ఏడుగురికి రూ.45 వేల చెక్కులు, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. పటమట ఫన్‌టౌమ్స్ క్లబ్ రోడ్డులోని వీసీబీ బ్రాంచిలో జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది బ్యాంకు సభ్యుల పిల్లలకు రూ.24 లక్షలతో ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతిలో 90 శాతం మార్కులకు పైగా సాధించిన వారికి రూ.5 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.7,500, నీట్‌లో వెయ్యిలోపు ర్యాంకర్‌కు రూ.10 వేలు చొప్పున ప్రోత్సాహకాలు అందించామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు పొట్లూరి వెంకట రమణారావు, చిన్నం కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ సీహెచ్‌వీఆర్ సుబ్రహ్మణ్యం, మేనేజర్లు కె.కొండబాబు, సీహెచ్ సత్యనారాయణ, కావ్య పాల్గొన్నారు.